క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఎంటీ హిల్స్ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు జలవాయు విహార్ ప్రాంతంలో, 11 కేవీ శ్రీనివాసం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు అరుణ సొసైటీలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మూసాపేట: కైత్లాపూర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ ప్రకటించారు. గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆంజనేయ నగర్ రోడ్డు నెంబర్ 5,6,7, జనతానగర్, మూసాపేట ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూసాపేట వార్డు కార్యాలయం, గూడ్స్‌షెడ్, జేపీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



భాగ్యనగర్‌కాలనీ: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మియాపూర్ సీఐ ప్రేమ్‌కుమార్‌ను విద్యార్థి నేత పవన్‌కుమార్, ఉద్యమకారుడు సిల్వర్ మనీష్‌కుమార్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మందకొడిగా లిక్కర్ టెండర్లు

బాలానగర్: బాలానగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వరకు 800 మంది లిక్కర్ షాపుల కోసం టెండర్లు వేశారు. 40 వైన్‌షాపులు, 50 బార్లు ఉన్నాయి. గతం కంటే షాపులకు టెండర్లు వేయడం కొంచెం మందకొడిగానే సాగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



కూకట్‌పల్లి: దయార్‌గూడలో నివసిస్తున్న జిల్లెల రాణి గత కొద్ది కాలంగా నరాల బలహీనత ద్వారా కంటి సమస్యతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. వైద్యులు మూడు నెలలకోసారి ఇంజక్షన్ తీసుకోవాలని సూచించడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆమె బీఆర్ఎస్ సీనియర్ నేత గొట్టిముక్కల వెంకటేశ్వరరావును కలిశారు. దీంతో ఆయన సీఎం రిలీఫ్ ఫండ్‌కోసం వారితో దరఖాస్తు చేయించారు. బుధవారం రూ.35 వేల ఎల్‌ఓసీ పత్రాలను బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆమె అందజేశారు.

కుష్టువ్యాధిపై ఇంటింటి సర్వే

బాలానగర్: బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. బుధవారం బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఏఎన్‌ఎంలు ప్రజల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కుష్టువ్యాధి సర్వే చేస్తున్నామని ఈ సర్వే నెలాఖరు వరకు కొనసాగుతుందని సూపర్‌వైజర్ హేమసుందరి ప్రకటించారు. పరీక్షల్లో వ్యాధి లక్షణాలు కనబడితే వారికి వెంటనే వైద్య చికిత్స అందజేస్తామన్నారు.

దళిత సంక్షేమ నూతన కార్యవర్గం

బాలానగర్: బాలానగర్‌లో తెలంగాణ దళిత సంక్షేమ ఎన్నికల్లో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడు ఆదిమూల రాము, ప్రధాన కార్యదర్శి గీడిమెట్ల రమేష్, కోశాధికారి దండు రవికుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. దళితుల సంక్షేమం, ప్రభుత్వ పథకాలు దళితులకు అందేలా కృషి చేస్తానన్నారు.

ప్రొ.గాలి వినోద్‌కుమార్‌కు వీడ్కోలు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ న్యాయ కళాశాల అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్‌కుమార్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఉద్యోగానికి వీఆర్ఎస్ ఇచ్చిన గాలి వినోద్‌కుమార్ ఆయన భార్య చంద్రకళను బుధవారం కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యాపకులు సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ప్రిన్సిపల్ ప్రొ.రాధిక యాదవ్, లా సీనియర్ అధ్యాపకులు, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి, హెడ్ ప్రొ.వెంకటేశ్వర్లు, ప్రొ.రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాదయాత్ర

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు
- కేంద్ర ప్రభుత్వంపై ఎమ్మెల్యే మండిపాటు
- ఎన్నికల పాదయాత్ర అని బీజేపీ నేతల విమర్శలు
- పార్కులు, కబ్జాలను పట్టించుకోవడం లేదని మండిపాటు



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట: గ్రేటర్ హైదరాబాద్‌లో డబుల్ బెడ్రూం దరఖాస్తు చేసుకున్న వారి తనిఖీ కార్యక్రమం జరుగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే మాయమాటలు చెప్పే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏమి చేసిందో చెప్పాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సవాల్ విసిరారు. బుధవారం ఫతేనగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో 13వ రోజు పాదయాత్ర చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఫతేనగర్ డివిజన్‌లో 90 శాతం పనులు పూర్తి చేశామని డివిజన్‌కు నాలా సమస్య ఎదురవుతోందన్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో ఫతేనగర్‌లోని లోతట్టు ప్రాంతం కావటంతో ఇళ్లలోకి నీరు వచ్చే ప్రమాదం ఉందన్నారు. దీని కోసం మంత్రి కేటీఆర్‌తో చర్చించి ఫతేనగర్ నాలా శాశ్వత పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలతో అల్లకల్లోలం అయితే కేంద్ర ప్రభుత్వం ఏమి చేసిందో సమాధానం చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా స్కూల్ కిట్‌లను అందజేశారు.

'పార్కుల కబ్జా కనిపించడంలేదా'..

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ 6 ఫేజ్‌లో పార్కుని కబ్జాదారులు కబ్జా చేసి ఇష్టానుసారంగా షెడ్ల నిర్మాణం చేపట్టి డబ్బులు దండుకుంటుంటే స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారికి సహకారం అందిస్తున్నారని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి ఆరోపించారు. గోకుల్ ప్లాట్ చౌరస్తాలో స్థానిక బీజేపీ నేతలతో షెడ్లు వేసిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పాదయాత్రల పేరిట డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పార్కులు కబ్జా అవుతుంటే కనిపించడం లేదని విమర్శించారు. 'అభివృద్ధి అంటే పార్కులు కబ్జా చేయటమేనా' అని ప్రశ్నించారు.

◆ చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు పార్కు స్థలాల్లో ఎమ్మెల్యే అండదండలతో రూమ్‌లు కట్టించి అక్కడే నివాసాలు ఏర్పరచుకునేలా అధికారులను వాడుకుంటూ.. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. భవిష్యత్తులో ఎమ్మెల్యే చేస్తున్న భాగోతాలను తాము బయట పెడతామని ఆయన హెచ్చరించారు. బీజేపీ జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీ 6వ ఫేజ్ పార్కు స్థలంలోని షెడ్డును పరిశీలిస్తున్న పన్నాల హరీష్ రెడ్డి

కార్మికులకు పక్కా భవనం నిర్మించాలి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని రెడ్డి సంఘం సమీపంలోని శ్రీ భవాని శ్రమశక్తి భవన నిర్మాణ కార్మిక సంఘం స్థలంలో కార్మికులకు పక్కా భవనం నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సంఘం అధ్యక్షుడు బాలాజీ పేర్కొన్నారు. కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సీఐ కె. క్రాంతికుమార్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జగద్గిరిగుట్ట ఎస్సై సత్యం, వ్యవస్థాపక అధ్యక్షుడు కె. వీరనాగప్ప, సలహాదారులు ఎండీ యూసుఫ్, అంకమరావు,



మాట్లాడుతున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

ప్రధాన కార్యదర్శి కాశిం, శ్రీను, కోశాధికారి ఆగంరెడ్డి, వి.ఆరోగ్యం, కమిటీ సభ్యులు శ్రీను, రవి, చంద్రయ్య, తిరుపతిరావు, హరిబాబు, కృష్ణారావు, ఆంజనేయులు, రాంబాబు, శివకుమార్, నర్సింహ, గణేష్, దుర్యోదన సంజీవ్‌రావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మూసాపేట్‌లో పర్యటిస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట, స్నేహపురి కాలనీలో మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పర్యటించారు. బుధవారం అవంతినగర్ తోటలో డ్రైనేజీ సమస్య, స్నేహపురి కాలనీలో కలుషిత నీటి సరఫరా సమస్య ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో డివిజన్‌లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించామన్నారు. మాజీ కౌన్సిలర్ సీ.హెచ్. సత్యనారాయణ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ఏఈ అనురాగ్, వాటర్ వర్క్స్ మేనేజర్ ప్రకాష్, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, సత్యనారాయణస్వామి, వినోద్‌యాదవ్, వెంకటేశ్వరరెడ్డి, జైరాజ్ తదితరులున్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

కూకట్‌పల్లి: డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్, ప్రగతినగర్‌లలో అన్ని విభాగాల అధికారులతో కలిసి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కాలనీ అధ్యక్షులు విఠల్, గణపతి, నాయకులు నర్సింహ, ఎర్రన, సత్తెయ్య, సాయి, అంజి, కవిత, నీలా, జ్యోతి, ప్రమీల, జయమ్మ ఉన్నారు.



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ సత్యనారాయణ

చండీహోమం



చండీహోమంలో పాల్గొన్న మక్కాల సత్యనారాయణ

ఓల్డ్ బోయిన్‌పల్లి: అమావాస్య సందర్భంగా ఓల్డ్ బోయిన్‌పల్లి అంజయ్యనగర్‌లోని రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మార్కెట్ చైర్మన్ సత్యనారాయణ చండీహోమం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను తీసుకున్నారు.

గద్దర్‌కు నివాళి

మోతీనగర్: ఆట పాట మాటకు ప్రతి రూపమే ప్రజా యుద్ధనౌక దివంగత గద్దర్ అని మోతీనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ మాజీ అధ్యక్షుడు నల్లమాల్పు అంజిరెడ్డి అన్నారు. బుధవారం మూసాపేట డివిజన్ మోతీనగర్ చౌరస్తాలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో తన గళంతో ఎంతో మందిని ఉద్యమం వైపు ఆకర్షితుల్ని చేసి, ఉద్యమంలో వారు చురుగ్గా పాల్గొనేటట్లు చేశారన్నారు. గద్దర్ ఒక కళాకారుడిగానే కాకుండా మంచి సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన మరణం సామాజిక వర్గానికి, పేదలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటస్వామి, మహమ్మద్ అలీ, విష్ణు, శ్రీనివాసరావు తదితరులున్నారు.



నివాళులర్పిస్తున్న అంజిరెడ్డి తదితరులు

అనారోగ్య సమస్యలు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

సుభాష్‌నగర్: అనారోగ్య సమస్యలను భరించలేని ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూరారం పోలీసుల సమాచారం మేరకు... పశ్చిమబెంగాల్ నదియా జిల్లా నాదిబతాయ్‌కు చెందిన నితాయ్ మండల్(27) జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చి సూరారం రాజీవ్ గృహకల్పలో నివాసముంటూ ఓ పరిశ్రమలో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 15న నితాల్ మండల్ భార్య జూపార్క్‌కు వెళ్లడంతో ఫిట్స్ కారణంగా బాధపడుతున్న అతనొక్కడే ఇంట్లో ఉన్నాడు. సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో నితాయ్ మండల్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫిట్స్ కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి సోదరుడు సుకుమార్ మండల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి పుణ్యతిథి సందర్భంగా బీజేపీ నాయకులు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. బుధవారం మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి పప్పుపటేల్ ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. డివిజన్ అధ్యక్షుడు సంతోష్‌గౌడ్, జిల్లా కార్యాలయం ఇన్‌చార్జి రవికుమార్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యమూర్తి, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, అమర్‌గౌడ్, నిఖిల్ తదితరులున్నారు.

మొతీనగర్: దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అని మేడ్చల్ జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవి, తాత్వికుడు, నిగర్వి రాజనీతిజ్ఞుడైన, ప్రత్యర్థులు సైతం ప్రశంసించగలిగిన గొప్ప మహనీయుడు వాజ్‌పేయి అన్నారు. మునగాల పద్మారావు, విజయ, అమ్రేష్, రాజు తదితరులున్నారు.



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వర్సిటీల బంద్ ప్రశాంతం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ కోసం కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన యూనివర్సిటీల బంద్ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం తెలంగాణ వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ వర్సిటీలను బంద్ చేశారు. ఓయూ, కేయూ, పాలమూరు, శాతవాహన, తెలంగాణ, తెలుగు వర్సిటీ, మహిళా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ తదితర యూనివర్సిటీల పరిధిలోని వివిధ కాలేజీలను బంద్ చేసినట్లు తెలిపారు. ఈ నెల 19, 20 తేదీలలో ఇందిరా పార్క్ వద్ద 48 గంటల సామూహిక సమర దీక్షను చేపట్టనున్నట్లు అధ్యాపక జేఏసీ నాయకులు వేల్పుల కుమార్, ఉపేందర్ రావు, విజేందర్‌రెడ్డి తెలిపారు.

రెగ్యులరైజ్ చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి

కుత్బుల్లాపూర్: తమను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, కమిషనర్ శ్రీహరిలను కలిసి వినతి పత్రం అందజేశారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, జీతాలను పెంచడంతో పాటు తమను రెగ్యులరైజ్ చేయాలని ఉద్యోగులు కోరగా చైర్మన్ సానుకూలంగా స్పందించారు.

విద్యార్థినులకు చేయూత

దుండిగల్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు పలువురు ముందుకు వచ్చారు. దుండిగల్ ప్రభుత్వ ఉన్న పాఠశాలలో గత ఏడాది 10వ తరగతి ఫలితాల్లో 9.7 జీపీఏ సాధించిన ముగ్గురు విద్యార్థినులు కె.నిఖిత, మీనాక్షి, షమ్మ కాతూన్‌లకు ఒక్కొక్కరికి రూ. 5 వేల ప్రకారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్య నళిని అందజేశారు. అలాగే బాసర ఐఐటీ సీటు సాధించిన నిఖితకు స్థానిక కౌన్సిలర్ జక్కుల కృష్ణాయాదవ్ బంగారు ఉంగరాన్ని బహూకరించారు. రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు రాధాకృష్ణ సాయి, చక్రవర్తిలు బాలికలకు శానిటేషన్ ప్యాడ్స్, వెండింగ్ మిషన్, బహుమతులు ఇచ్చారు. హిందీ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి రూ. 3 వేలు, పూర్వ విద్యార్థులు కాపర్ బాటిళ్లను అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి



పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, నగదు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

మోతీనగర్: పారిశుద్ధ్య కార్మికులు కరోనా సమయంలోనే కాకుండా సాధారణ రోజుల్లో వారు చేసే సేవలు వెలకట్టలేనివని గంగుమళ్ల చారిటబుల్ ట్రస్ట్, శివదుర్గ ఎస్టేట్ సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు గంగుమళ్ల వరప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, నగదు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికులు తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు నిరంతరం రోడ్లపైనే విధులు నిర్వహిస్తుంటారన్నారు. వారు చేసే సేవకు ఏమిచ్చినా తక్కువే అన్నారు. సుజాత, వెంకట్, మహేష్, భవాని, శరత్, శ్రీవాసు, శ్రీలక్ష్మీ, సునందిత, దినేష్‌చంద్ర, రాజు, ఎస్‌ఎఫ్‌ఏ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమకారులకు కేసీఆర్ ద్రోహం'



ఉద్యమకారుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న అశోక్‌రెడ్డి తదితరులు

రంగారెడ్డినగర్: సీఎం కేసీఆర్ ఉద్యమకారులను తన అవసరంకొద్దీ వాడుకున్నారే తప్ప ఎన్నడూ వారిని ఆదుకున్న పాపాన పోలేదని ఉద్యమకారుల వేదిక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి ఆరోపించారు. రంగారెడ్డినగర్ డివిజన్‌కు చెందిన ఉద్యమకారులు ఉద్యమకారులు లక్ష్మణ్ గౌడ్, ఫయాజ్, నర్సింగ్, మహబూబ్‌లు తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ చేపట్టిన నిరాహార దీక్ష రెండవ రోజుకు చేరుకుంది.. బుధవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలోని దీక్షా శిబిరానికి వచ్చిన అశోక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పప్పిరెడ్డి సరేందర్‌రెడ్డిలు ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమకారులకు రూ. 10 వేల పింఛన్, ఉచిత బస్‌పాస్ ఇవ్వాలని, సంక్షేమ పథకాల్లో 20 శాతం ఉద్యమకారులకు ఇవ్వడంతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం దీక్ష చేపట్టిన వారికి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఫయాజ్, కృష్ణారెడ్డి, శోభకృష్ణాగౌడ్, రామస్వామి, జానయ్య నిరాహార దీక్షకు సంఘీభావం తెలియజేశారు.

వేడుకగా ప్రత్యంగిరా హోమం

జగద్గిరిగుట్ట: అమావాస్యను పురస్కరించుకొని డివిజన్ పరిధిలోని వివిధ ఆలయాలలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంజయ్యనగర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో అభిషేకం, అర్చన, అలంకరణ వంటి పూజలతో పాటు ప్రత్యంగిరా హోమాన్ని వేడుకగా నిర్వహించారు.



జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీ కాళికామాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



హైదర్‌నగర్ డివిజన్‌లో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



బాలాజీనగర్ డివిజన్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శిరీష

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీకాలనీ 15వ ఫేజ్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ శిరీష బాబూరావు పరిశీలించారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ.. పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఏఈ శ్రీనివాస్, భాస్కర్‌రావు, సుశీల్‌కుమార్, జీవ, జ్యోతి, సావిత్రి, శారద, ఎస్తేర్ తదితరులున్నారు.

నవోదయ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులు..

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని నవోదయ కాలనీలో నూతన డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను చేపట్టనున్నారు. బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవోదయ కాలనీలో రూ.16 లక్షలతో నిర్మించనున్నట్లు తెలిపారు. కాలనీలో జన నివాసాలు పెరిగి డ్రైనేజీ వ్యవస్థ సరిపోకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున నూతన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం చేపడతామన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కాశీనాథ్‌యాదవ్, రాజిరెడ్డి, వాసుదేవరావు తదితరులున్నారు.

మెరుగైన రవాణా సౌకర్యం..

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహననగర్‌లో రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. సీసీరోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు నర్సింహ, రామకోటేశ్వర్‌రావు, మదన్ మోహన్, సత్యనారాయణ, హనుమంత్‌రాజు, రామచంద్రారెడ్డి, రాములు తదితరులున్నారు.



నవోదయ కాలనీలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132